క్లుప్తంగా

8న సామూహిక ప్లాంటేషన్

అడ్డతీగల: మండలంలోని సామూహిక ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఈనెల 8న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకంలో మంజూరైన ప్లాంటేషన్ పనులను అడ్డతీగల మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో అదే రోజు ప్రారంభిస్తామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్దలు, ఉపాధి శ్రామికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రకృతి సాగుపై అవగాహన


అవగాహనలో పాల్గొన్న రైతులు

ఎటపాక: మండలంలోని కృష్ణవరం క్లస్టర్ పరిధిలోని గొమ్ముకొత్తగూడెం గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి సాగుపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్ జెట్టి వెంకట్ సూచనలు, సలహాలిచ్చారు. విచక్షణరహితంగా పురుగులమందుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.
ఇంటి పెరటిలో పండించే కూరగాయలు, ధ్లు సాగును ప్రకృతి సాగు విధా ఏ పంటలు ఏ కాలంలో పండించాలి, వాటి కషాయాలు, ద్రావణాలతో ఎలా పెంచాలి అని అవగాహన కల్పించారు. డ్వాక్రా సంఘాల మహిళలు, వీఓలు, వీఏఓ సున్నం కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలల్లో సికిల్‌సెల్ ఎనీమియా ప్రాథమిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వైద్య సిబ్బంది పరీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కొయ్యూరు బాలుర ఆశ్రమ పాఠశాల–1లో ప్రాథమిక పరీక్ష చేశారు. ఈ పరీక్షలో నిర్ధారణ అయితే రెండో పరీక్ష కోసం పాడేరు ఆస్పత్రికి పంపించి నిర్ధారించారు. అక్కడ కూడా నిర్ధారణ అయితే సికిల్‌సెల్ ఉన్నట్టుగా ప్రకటిస్తారు.

శరవేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు


అలడమూలలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయితీ అలడమూల గ్రామంలో ఈదురుగాలులతో చింత చెట్టు పడి విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు తెగిపడిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం తెల్లవారుజాము నుంచి విద్యుత్ సిబ్బంది , స్థానిక సర్పంచ్ నరసింగరావు, గ్రామస్తుల సహకారంతో విద్యుత్ పునరుద్ధీకరణ పనులు శరవేగంగా చేశారు. విద్యుత్ స్తంభాలను ,విద్యుత్ వైర్లను సరి చేసి విద్యుత్ సరఫరాను అందించారు. వనభసింగి,ఏనుగురాయి, జర్రెల, కర్రిముఖిపుట్టు పంచాయతీల్లో పలు గ్రామాల్లో సైతం విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


రొతులు విష్ణు(ఫైల్)

చింతపల్లి: చెంచెంపూడి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక(ఎంపిపి)పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రొతుల విష్ణు(40) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. గూడెం కొత్తవీధి మండలం దారకొండ పంచాయతీ నేలజర్త గ్రామానికి చెందిన విష్ణు చింతపల్లిలో కుటుంబంతో నివాసమంటున్నారు.గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆరోగ్యం విషమించి తుదిశ్వాస విడిచినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన అంతిమ సంస్కారాలను స్వగ్రామంలో ఆదివారం నిర్వహించనున్నట్టు కుటుంబీకులు తెలిపారు. ఉపాధ్యాయుడు విష్ణు మృతికి ఉపాధ్యాయులు తదితరులు సంతాపం తెలిపారు.

సమస్యతో సతమతం


అప్పలరాజుపేటలోని గిరిజన ప్రాథమిక పాఠశాల


తల్లిదండ్రుల సమావేశంలో విన్నవిస్తున్న విద్యార్థి తల్లి

- పాఠశాలల ఎత్తివేతపై సర్వత్రా ఆందోళన
- గ్రామానికి బడిని దూరం చేయనున్న కూటమి ప్రభుత్వం

రాజవొమ్మంగి: గ్రామానికి గుడి, బడి అందం.. రాజవొమ్మంగి మండలంలోని ఆదివాసీ తండా అప్పరాజుపేటలో ఉన్న సర్కారు పాఠశాలను తరలించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే .. రాజవొమ్మంగి మండలంలో 34 ఏకోపాధ్యాయ (జీపీఎస్) పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల్లో చదువుతున్న పిల్లలను స్థానికంగా కాకుండా సమీపంలోని ఆశ్రమ పాఠశాలల్లో చేర్పేందుకు కసరత్తు జరుగుతోంది. దీంతో ముక్కుపచ్చలారని తమ పిల్లలను ఎక్కడో దూరంగా వసతి గృహాల్లో చేర్చడంపై తల్లిదండ్రులు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఇటీవల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడంతో వారి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమ పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో వేరే గ్రామంలోని వసతి గృహాలకు తరలించమని తేల్చి చెప్పారు. తమ పిల్లలు ఇంకా తమ సొంత పనులు చేసుకోలేరని, వారి అలనాపాలనా తల్లిదండ్రులమైన మేమే చూసుకొంటున్నామని చెబుతున్నారు. తమ పిల్లలను వసతి గృహాల్లో చేర్పిస్తే వారిని చూసేది ఎవరని ప్రశ్నిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చేందుకే

ప్రస్తుతం తమ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతి పిల్లలను వసతి గృహాలకు తరలిస్తే ఇక ఒకటి, రెండు తరగతి పిల్లలు మాత్రమే పాఠశాలలో ఉన్నారు. వీరిని స్థానిక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి చేతులు దులుపుకోడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పిల్లల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
ఈ విషయంపై రంపచోడవరం ఏటీడబ్ల్యూవో కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు జీపీఎస్ పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు చదువుతున్న పిల్లలను వారి స్వగ్రామాలకు సమీపంలోని వసతి గృహాలు, ఆశ్రమపాఠశాలల్లో చేర్పుతున్నామన్నారు. ఈ ప్రక్రియ ఈ ఏడాదే అమలులోకి వస్తోందన్నారు. పిల్లలను నాణ్యమైన విద్యాబోధన అందించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు.

గ్రామంలో బడిని ఎత్తివేస్తే ఊరుకోం



మా పిల్లల్ని ఎక్కడో దూరంగా వసతి గృహంలో చేర్పుతాము అంటే కుదరదు. మా పిల్లలు ఇంకా చిన్నపిల్లలు. 5వ తరగతి ఉత్తీర్ణత అయి ఆరవ తరగతిలోకి వచ్చిన తరువాత వారిని మేమే వసతి గృహాల్లో చేర్పుతాం. ప్రస్తుతం మా గ్రామంలో బడిని ఎత్తివేస్తామంటే ఊరుకోం. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.
– గోరా నాగమణి.
అప్పలరాజుపేట. గిరిజన మహిళ

చిన్నారులను చదువుకోసం వేరే గ్రామానికి పంపం



మా పిల్లలు ఇంకా చిన్నపిల్లలు. వారికి ఇంకా ఏమీ తెలియదు.టాయ్‌లెట్‌కు వెళ్ళాలన్నా, బ్రష్ చేసుకోవాలన్నా తల్లిదండ్రుల సహాయం కావాల్సిందే. అటువంటి చిన్నపిల్లలను దూరంగా హాస్టల్‌లో ఉంచితే ఎలా. వారి కనీస బాగోగులకు ఎవరు బాధ్యత వహిస్తారు. మా పిల్లలను వేరే గ్రామానికి పంపాం.
–చిన్ని నూకరత్నం
–గిరిజన మహిళ: అప్పలరాజుపేట

ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

రంపచోడవరం: రంపచోడవరం ఎంపీడీవోగా తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ శనివారం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జెడ్పీ సీఈవో ఆదేశాల మేరకు రంపచోడవరం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు అమలుకు, మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించండి


ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో

రోలుగుంట : ప్రకృతి సేద్యంపై అవగాహన పెంపొందించుకొని తద్వారా పంట దిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయాధికారి చదువుల చిరంజీవి అన్నారు. శరభవరం పంచాయతీ శివారు అర్ల గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఘన జీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు.

విద్యా సామర్థ్యాలకు బేస్‌లైన్ టెస్ట్


అడ్డతీగల జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు


గాంధీనగరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర తరల్ ఇన్‌చార్జి హరిబాబు తదితరులు

అడ్డతీగల: విద్యార్థుల విద్యా సామర్థ్యాల పరిశీలనకు బేస్‌లైన్ టెస్ట్ శనివారం నిర్వహించినట్టు ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా మూడు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు, గణితం సబ్జెక్ట్‌లలో వారి స్థాయిలను గుర్తించడానికి పరీక్ష నిర్వహించామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లలో పదాలు, వాక్యాలు, కథలు, గణితంలో అంకెలు గుర్తించడం, కూడికలు, గుణకారాలు, భాగాహారాలు వంటి వాటిలో పరీక్షలు జరిపామన్నారు. అడ్డతీగల మండలంలో 97 పాఠశాలల్లో ఈ టెస్ట్ నిర్వహించినట్టు తెలిపారు.
జి.మాడుగుల: మండలంలో గాంధీనగరంలోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలను రాష్ట్ర తరల్ ఇన్‌చార్జి హరిబాబు, ఏఎంవో కె.భాస్కర్, ఏఎస్‌వో జి.సింహాచలం శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన బేస్‌లైన్ టెస్టు పరిశీలించి సంతృప్తి వ్యక్తం పరిచారు. పాఠశాల పీఎస్ హెచ్‌ఎం మత్స్యరాస మత్స్యరాజు, ఉపాధ్యాయులు నాగమణి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు


ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ పనులను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకరరావు

చింతపల్లి: మండల కేంద్రంలో నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ వి.ప్రభాకరరావు అన్నారు. మండల కేంద్రంలోని పలుచోట్ల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లపై చెట్టుకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం మేరకు వెనువెంటనే మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు.అదే విధంగా మండల కేంద్రంలో లోఓల్టేజి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలిస్తున్నామన్నారు. మండల కేంద్రంలో పలు వీధుల్లో క్రిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లలో పలువురు గృహవాసులు ఇబ్బందులు పడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు అయిదు చోట్ల స్థంభాలను మార్పు చేస్తున్నామన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీకి సిద్ధం


చింతపల్లిలో విత్తనాల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి: మండలంలో రైతుల కోసం రెండు రకాల రాగి విత్తనాలు వందశాతం సబ్సిడీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ప్రభుత్వం అధిక దిగుబడినిచ్చే ఇంద్రావతి, వేగవతి రాగి మినీ కిట్‌లను 233 మంది ఆదర్శ రైతులకు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈ రెండు రకాల విత్తనాలతో సాగు విస్తీర్ణం పెంచే విధంగా ఆదర్శ రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రస్తుతం పంపిణీ చేసే ఇంద్రవతి పంట రకంలో కాల్షియం, ఐరన్, జింక్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. పంట రకాలను రబీ, ఖరీఫ్ సీజన్‌లోను సాగు చేయవచ్చన్నారు. పంట కాలం 110 రోజులు నుంచి 120 రోజులు కాల పరిమితిగా చెప్పారు. వంద శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వరమే కేసుల పరిష్కారం


అరకులోయలో కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి రాము


అడ్డతీగలలో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి మురళీ గంగాధరరావు

అరకులోయటౌన్: అరకులోయ ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్‌చార్జి జడ్జి ఏ.రాము 35 కేసులు పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సత్వరమే కేసులు పరిష్కారమవుతాయన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 16 ఐపిసి కేసులు, ఎక్సైజ్ కేసులు–8, మెయింటెనెన్స్ కేసులు–2, పేకాట కేసు ఒకటి, లేబర్ కేసులు మూడు, నేరం అంగీకరించబడిన 5 కేసులను పరిష్కరించారు. అరకులోయ సీఐ ఎల్.హిమగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి ఎస్‌ఐలు గోపాలరావు, పాపినాయుడు, శ్రీనివాసరావు, కోర్టు సూపరింటెండెంట్ వై.వి.చక్రపాణి, మోహన్‌రావు, న్యాయవాదులు మురళీకృష్ణ, రత్నరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 33 కేసుల పరిష్కారం

అడ్డతీగల: రాజీకి వీలైన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ మార్గమని అడ్డతీగల జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఎం.మురళీ గంగాధరరావు అన్నారు.అడ్డతీగల కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 33 కేసులు రాజీ చేసినట్టు న్యాయమూర్తి తెలిపారు. వీటిలో చెక్ బౌన్స్ కేసులు–2,ఎక్సైజ్ కేసులు–5, మెయింటెనెన్స్ కేసులు–1, క్రిమినల్ కేసులు–25 ఉన్నట్టు తెలిపారు. న్యాయవాదులు కె.ఎస్.వి.రమణ, డి.శ్రీధర్, వివిధ పోలీస్‌స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 143 కేసులు రాజీ

రంపచోడవరం: రంపచోడవరంలోని మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో అడ్డతీగల, రంపచోడవరంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అడ్డతీగల మండలానికి సంబంధించి 33 కేసులు , రంపచోడవరం మండలానికి సంబంధించి 143 కేసులు రాజీ చేసినట్టు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ ఎం మురళీ గంగాధరరావు తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏవోకు సన్మానం

ఎటపాక: మండలానికి నూతన వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌ను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా జనసేన మండల అధ్యక్షుడు గంగాధర్ తదితరులు ఏవో రమేష్‌ను సన్మానించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గోదావరి వరదల రాకముందే రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేయాలని కోరారు. వెంకట్, లోకేష్ తదితరులున్నారు.

హైడ్రో వపర్ ప్రాజెక్టుతో ఏజెన్సీకి ముప్పు

హుకుంపేట: అనంతగిరి మండలంలోని పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ఏక పక్షంగా తీసుకు వచ్చిన జీవో నెంబర్ 51ని రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయా జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్దేవ్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఆదివాసీల ప్రత్యేక హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి షెడ్యూల్ ప్రాంతమైన అనంతగిరి మండలం పెదకోట గ్రామంలో హైడ్రో ఫవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అదాని కంపెని అనుమతులు మంజూరు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు వల్ల ఏజెన్సీ సర్వనాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: మండల కేంద్రంలోని ఐటీడీఏ సమావేశపు హాలులో సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీతో కలిసి రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి శనివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిధిలో పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీ అభివృద్ధికి అధికారులు యాక్షన్ ప్లాన్ తయారు చేసి సమర్పించాలన్నారు. జీసీసీ డైరెక్టర్ సునీత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


తడి చెత్త-పొడి చెత్తపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో లవరాజు తదితరులు

అరకులోయటౌన్: మండలంలోని గన్నెల, మాడగడ పంచాయతీ పరిధిలోని అమలగుడ, గన్నెల, ఆర్‌కె. నగర్, మాడగడ, నందిగుడ, డింగ్రిపుట్, దళపతిగుడ, బోసుబెడ గ్రామాల్లో గత రెండు రోజులుగా ఎంపీడీవో అడప లవరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.వి.సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా రోజూ చెత్త సేకరణ చేపడుతున్నామన్నారు. గ్రామస్తులు పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని, వాటిని సంపద కేంద్రాలకు తరలిస్తామన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. మురుగుకాలువలు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శులు బోడిరాజు, మహేష్, పాత్రుడు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బారావు

ఎటపాక: రానున్న గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ కారం సుబ్బారావు చెప్పారు. గోదావరి వరదలపై శనివారం ఎటపాకలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వరదలను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాలకు ముందుగానే బఫర్ స్టాక్ నిల్వచేయాలన్నారు.మండలంలో ముంపు గ్రామాలను గుర్తించి ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి అప్రమత్తం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలు, తాగునీరు, లైట్లు, శానిటేషన్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద రెండవ ప్రమాదహెచ్చరిక చేరితే రాయనపేట, నెల్లిపాక, మురుమూరు వద్ద ప్రధాన రహదారులపైకి నీరు చేరుతుందన్నారు. దీంతో పాటు జాతీయరహదారి కూడా ముంపునకు గురై రవాణా సౌకర్యం ఉండదని హెచ్చరించారు. దీనిపై ప్రత్యామ్నాయంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీడీవో అప్పలరాజు, ఎంఈవో లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన


నరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాడేరు రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైనట్టు ఆర్టీసీ ఉద్యోగులు సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ భానుమూర్తి తెలిపారు. పాడేరులో ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారం నాటికి రెంవ రోజు చేరింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు,. ఉద్యోగుల నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరం చూపడం లేదన్నారు. దశాబ్దాల నుంచి ఆర్టీసీ సంస్థ నిర్వీర్యమవుతుందన్నారు. ఉద్యోగులకు అందజేయాల్సిన పిఆర్‌సీ నేటికి అమలు చేయాలేదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పిఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు అమలు చేయని పక్షంలో దశలవారీగా ఉద్యమం తీవ్రం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం డిపో అవరణలో ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భవిషత్ కార్యచరణపై చర్చించారు, జోనల్ క్యాదర్శిగా కృష్ణమూర్తి, ఎస్‌కె వల్లి, చందు, నాయకులు రాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన లారీ

- అప్రోచ్ రోడ్డులేక అవస్థలు


పిల్లిగెడ్డ బ్రిడ్జి వద్ద బురదలో కూరుకుపోయిన లారీ

సీలేరు: గూడెం కొత్తవీధి మండలంలో సీలేరు మీదుగా సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ దుప్పులవాడ పంచాయతీ పిల్లిగెడ్డ గ్రామ సమీపాన గల బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు లేక బురదలో కూరుకుపోయింది. గత సంవత్సరం సెప్టెంబరు 8న కురిసిన భారీ తుపానుకు పిల్లిగెడ్డ బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ఆంధ్రా–ఒడిశా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నూతన వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా వంతెన నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ బ్రిడ్జికి ఇరువైపులా మట్టిని తవ్వి విడిచిపెట్టేయడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్డు బురదమయంగా తయారైంది. దీంతో గూడెం నుంచి సిమెంటులోడుతో చిత్రకొండకు లారీ వెళ్తుండగా పిల్లిగెడ్డ వంతెన వద్ద బురదలో కూరుకుపోయింది. దీంతో ఒడిశా నుంచి ఆంధ్రాకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు లేకపోవడమే దీనికి కారణమని వాహనదారులు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పిల్లిగెడ్డ బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేసి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరులో స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో సమావేశమైన సీలేరు ఎస్‌ఐ రవీంద్ర బాలికలకు పలు సూచనలు ఇచ్చారు. శక్తి యాప్, పోక్సో చట్టం వంటి ప్రత్యేక చట్టాల గురించి వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ ,బాల్య వివాహాల వల్ల వచ్చే సమస్యలను గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరూ జాగ్రత్తగా ఉండాలని చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ,పాఠశాల సిబ్బంది, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.